ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
సోమవారం 6 అక్టోబరు 2025



జిల్లాలో మోస్తరు వర్షం

మంచిర్యాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం 18.7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కన్నెపల్లి మండలంలో 43.0 మిల్లీమీటర్లు, భీమినిలో 42.3, తాం డూర్‌లో 41.3, బెల్లంపల్లిలో 30.5, లక్షెట్టిపేటలో 28.0, హాజీపూర్‌లో 27.3, నెన్నెలలో 21.3, జన్నారంలో 20.0, కాసిపేట మండలం కొండాపూర్‌లో 8.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

బెల్లంపల్లి: పట్టణంతో పాటు మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు రహదరులు జలమయమయ్యాయి. వర్షం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాల్‌టెక్స్‌తో పాటు బజార్ ఏరియాలోని ఆంధ్ర బ్యాంక్‌కు వెళ్లే దారిలో భారీగా వరదనీరు చేరింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో బారీ వర్షం కారణంగా పత్తి చేనులోకి వరదనీరు చేరడంతో నష్టం వాటిల్లింది.

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలి

జన్నారం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికలువాయిదా వేయాలని బీసీకులాల ఉద్యమపోరాట సంఘం సభ్యులు కోడూరి చంద్రయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని పట్టుదలతో ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆమోదం కోసం గవర్నర్‌వద్ద బిల్లు పెండింగ్‌లో ఉందని దీనిని పూర్తి స్థాయిలో ఆమోదం జరిపి ఎన్నికల్లో 50శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలును కల్పించే విధంగా చూడాలన్నారు. పూర్తి స్థాయిలో ఎన్నికలు జరిపించాలని అన్నారు. నాయకులు నర్సయ్య, కొండయ్య, పురుషోత్తం, రాజయ్యలు పాల్గొన్నారు.

'స్థానికం'లో జంపింగ్‌ల హవా..!



- ఆశావహుల్లో వారి సంఖ్యే అధికం
- సొంత లాభం కోసమే పార్టీల ఫిరాయింపు
- టికెట్ల కోసం ముఖ్యనేతలపై ఒత్తిడి
- పార్టీనే నమ్ముకున్న వారి పరిస్థితి ప్రశ్నార్థకం

మంచిర్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఆశించే వారిలో ఇతర పార్టీల నుంచి అధికార పార్టీలోకి వచ్చిన వారే అధికంగా ఉన్నారు. మొదటి నుంచి పార్టీనే నమ్ముకుని పని చేసిన పాత వారిని పక్కన బెట్టి తమకే టికెట్ కావాలంటూ ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం పైసా ఖర్చు పెట్టకుండా, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించని వారు తమకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌తోపాటు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కార్పొరేటర్/కౌన్సిలర్ ఎన్నికలకు టికెట్లు కావాలని తిరుగుతున్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీతో లబ్ది పొందిన వారు సైతం నేడు అధికారంలో ఉన్న పార్టీలో చేరి తమ సంపాదనను పెంచుకోవాలనే లక్ష్యంతో ఉన్నారు. ఏళ్ల తరబడి పార్టీని పట్టుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేసి, ఎన్నో సాదకబాధకాలకు ఓర్చిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పక్కకు జరగాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంలో వివిధ నియోజక వర్గాలకు చెందిన ముఖ్య నేతలు ఆలోచించాల్సి అవసరం ఎంతైనా ఉందని, ఎవరికి టికెట్ ఇవ్వాలో...ఎవరెవరికి ఇవ్వకూడదో అధిష్ఠానం కూడా సరియైన నిర్ణయం తీసుకోవాలని పాత క్యాడర్‌కు చెందిన పలువురు నాయకులు కోరుతున్నారు.

ఆ రెండు నియోజక వర్గాల్లోనే అధికం...

జంపింగ్ జిలానీలు జిల్లాలోని చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాల్లోనే అధికంగా ఉన్నారు. ఆ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు గడ్డం వివేకానంద, గడ్డం వినోద్‌లు 2023 అసెంబ్లీ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు వివేకానంద బీజేపీలో ఉండగా, ఎన్నికలకు కొద్ది రోజుల ముందుగానే కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయనతోపాటు పెద్ద మొత్తంలో అనుచర వర్గం కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే బెల్లంపల్లి నియోజక వర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. అక్కడి ఎమ్మెల్యే వినోద్ సైతం అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరారు. ఆయన అనుచర వర్గం కూడా పార్టీ మారింది. అలాగే ఇతర పార్టీలకు చెందిన నాయకులు సైతం పెద్ద ఎత్తున పార్టీలు మారారు. ప్రస్తుతం ఆ ముఖ్య నేతలతోపాటే పార్టీలు మారిన నాయకులు ప్రస్తుతం నియోజక వర్గాల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్య నేతలు పార్టీలు మారక ముందు కాంగ్రెస్ జెండాలు మోసి, పార్టీ అభివృద్ధి కోసం పాటు పడిన వారికి పెద్దగా ప్రాధాన్యం లేదనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికే టికెట్లు కేటాయిస్తారనే అభద్రతాభావం పాత క్యాడర్‌లో నెలకొంది. ఇదిలా ఉండగా..- మిగతా 5లో

తీగలు అటు..నరికివేతలు ఇటు

- విద్యుత్ అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



నంనూర్ ఆర్‌అండ్ ఆర్ కాలనీలో నరికివేతకు గురైన చెట్లు

హాజీపూర్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్, గుడిపేట ఎల్లంపల్లి పునరావాస కాలనీల్లో గతంలో హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు స్థానిక లైన్‌మెన్ కరెంటు తీగలకు అడ్డువస్తున్నాయనే నెపంతో తీగల కిందివే కాకుండా ఆమడదూరంలో ఉన్న వృక్షాలను సైతం మొదలు వరకు నరికివేయించారు. వేసవిలో కాలనీ వాసు లు సేదతీరుతున్న వృక్షాలు నేడు నేలకొరగడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ లైన్‌మెన్ ఇతర అధికారులు కలిసి చెట్లు నరికే గుత్తేదారుతో ఒప్పందం చేసుకుని తీగలకు అడ్డువచ్చే చెట్లేకాకుండా సంబంధంలేని అడ్డుగాలేని భారీ వృక్షాలను కూడ నేలమట్టం చేయడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ రెండు పునరావాస కాలనీల్లో 80కిపైగా చెట్లను నరికివేశారు. అందులో 30చెట్లు తీగలకు అడ్డు లేకుండా నరికివేశారని గ్రామస్తులు చెబుతున్నారు. తీగలకు అడ్డుగా ఉంటే కొమ్మలు మాత్రమే నరికివేయాలే గాని ఇలా భారీ వృక్షాలను నేలమట్టంగా నరికివేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు



ప్రమాణ స్వీకరం చేస్తున్న మండల కార్యవర్గ సభ్యులు

దండేపల్లి అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు రాజకీయంతో పాటు మరింత అభివృద్ధి చెందినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని మంచిర్యాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాదాసు బాపు అన్నారు. ఆదివారం దండేపల్లిలో పద్మశాలి కమ్యూనిటి భవనంలో నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హక్కుల సాధనకు అందరు ఏకం కావాలన్నారు. కలిసి కట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలో మన పద్మశాలీలు జడ్పీటీసీ, సర్పంచు. ఎంపీటీసీ, వార్డు సభ్యులుగా పోటీ చేసి సత్తా చాటాలన్నారు. అనంతరం మండల పద్మశాలి సంఘం కార్యవర్గం, దండేపల్లి పట్టణ మహిళకార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వంగ శంకరయ్య, ఎనగందుల సత్యం, రాష్ట్ర, జిల్లా నాయకులు నాగ రాజు, మంగ, వీరస్వామి. కుటుంబరావు, గంగయ్య, మండల నాయకులు దుబ్బయ్య, దేవయ్య, శంకరయ్య, లక్ష్మన్, శంకర్, కిషన్, శంకరయ్య, చిలుకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరి పంట నేలపాలు



ఎసన్‌వాయిలో నేలకొరిగిన వరి పంటను చూపుతున్న మహిళా రైతు మల్లక్క

కోటపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఎసన్‌వాయి గ్రామానికి చెందిన దుర్గం మల్లక్క సాగు చేసిన వరిపంట నేలపాలైంది. మొత్తం ఐదున్నర ఎకరాల్లో వరిపంట సాగు చేయగా వర్షాలకు పంటంతా నేలమట్టమైంది. దీంతో చేతికందిన పంట నేలమట్టం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని మల్లక్క ఆవేదన చెందింది. ఇంత వరకు ఏ అధికారి తన పంట వైపు రాలేదని, తనకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరింది. జిల్లా వ్యవసాయా ధికారులు సర్వేచేసి కలెక్టర్ ద్వారా నష్టపరిహారం అందించి మల్లక్కను ఆదుకోవాలని బీజేపీ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య కోరారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న మీసేవ ఫెడరేషన్ సభ్యులు

చెన్నూరు, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మీసేవ కేంద్రం నిర్వహకుడు పుప్పాల సంతోష్‌కుమార్ ఇటీవల మృతిచెందగా ఆదివారం ఆయన కుటుంబాన్ని మీసేవ ఫెడరేషన్ సభ్యులు పరామర్శించారు. మంచిర్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్థిక సహాయంగా రూ. 42,700 ఆయన కుటుంబీకులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొంపెల్లి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

మంచిర్యాల క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం సీసీ కార్నర్‌కు చెందిన స్వాతి హైస్కూల్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడ్డారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ నారాయణరాజు హాజరయ్యారు. విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణతో మెదులుతూ జీవి తంలో ఉన్నత శిఖరాలను అధి రోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2006.2007 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు మంజుల, మూర్తి, బాను, సత్యం, రవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కాకా జయంతి వేడుకలు

- ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క



హైదరాబాద్‌లో కాకా చిత్రపటం వద్ద నివాలులర్పిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, నాయకులు

మందమర్రిటౌన్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు దివంగత కాకా జి. వెంకటస్వామి 96వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కాకాతనయుడు రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన గనులశాక మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకట స్వామి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌లు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ కలిసి కాకా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కార్మిక సంక్షేమంతో పాటు హక్కుల కో సం కృషి చేసిన గొప్పనాయకుడు కాకా వెంకటస్వామి అని కొనియాడారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటు పడిన నాయకుడని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాకా ఆశయసాధనే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వే డుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాకా అభిమానులు నిర్వహించడం ఆయన ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడని తెలిపారు.

కాకా ఆశయాలను కొనసాగిస్తాం

కాంగ్రెస్ పార్టీ కురవృద్ధుడు మాజీ కేంద్ర మంత్రి దివంగత కాకా వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తామని ఆయన తనయుడు, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం హైద్రాబాద్‌లో ఆదివారం నిర్వహిం చిన కాకా 96వ జయంతి వేడుకలకు హాజరై కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల పక్ష పాతి కాకాఅని పేర్కొన్నారు. ఆయన కృషి వల్లనే సింగరేణి సంస్థ నిలబడి లాభాల దిశలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం, మందమర్రి నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం : మంచిర్యాల పట్టణం ఐబీచౌరస్తా వద్ద కాక వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. నాయకులు హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పైసలేవి.. 5

- స్థానిక పోరుకు వేధిస్తున్న నిధుల కొరత
- ఒక్కో మండలానికి రూ. 2 లక్షల వ్యయం
- ఆర్థిక భారంతో అధికారులు సతమతం

అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ గిరిజనుల ఆందోళన



తాళ్లపేట అటవీ రేంజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

దండేపల్లి అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అధికారులు తమపై అక్రమంగా కేసులు బనాయిస్తూ తమను వేధిస్తున్నారని గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఆదివారం మండలంలోని తాళ్లపేట అటవీ రెంజ్ కార్యాలయం వద్ద మండలంలోని మామిడిపల్లి జీపీ పరిదిలోని దమ్మనపేట, మామిడిగూడ చెందిన గిరిజనులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా నాయక్‌పోడ్ సంఘం నా యకులు తత్ర అర్జున్, సేదం బాపు మాట్లాడుతూ కొంతకాలంగా లింగాపూర్ అటవీ బీట్‌లో పోడు వ్యవసాయం చేసు కుంటున్నామన్నారు. ఈక్రమంలో అటవీశాఖ అధికారులు గిరిజన మహిళలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని వారు వాపోయారు. గిరిజన నాయకులతో చర్చిల పేరిట పిలిపించి చెట్లను నరికినట్లు తప్పుడు కేసులు పెట్టి నోటీసులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పోడు వ్యవసాయం భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి అధికారులకు సహకరిస్తున్నా తమపై ఇలా ఫారెస్టు అధికారులు ప్రవర్తించడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు గతంలో ఉన్న కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ స్థానిక అటవీ శాఖ అధికారులు ఒక్కొక్కరిపై 5కేసులు బనాయించడం ఎంత వరకు సమాంజమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, విష్ణు, దుబ్బరాజం, బాలు, మహేష్, రాజేందర్, అదివాసి గిరిజన మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

దసరా ఎఫెక్ట్...

- బస్సుల్లో విపరీతమైన రద్దీ
- బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడ్డ జనాలు



బస్టాండ్‌లో ఫ్యాన్‌లు లేని రాడ్లు

మంచిర్యాల, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగపూట ఆర్టీసీ ప్రయాణిలు నానాఇబ్బందులు పడ్డారు. పండుగ తరువాత సోమవారం నుంచి కళాశాలలు, కార్యాలయాలు పునఃప్రారంభం కానుండడంతో సెలవుల కోసం సొంత ఊర్లకు వచ్చిన ప్రజానీకం తిరుగు పయనం అయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. మంచిర్యాలనుంచి హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ముంద స్తుగా రిజర్వేషన్లు చేపించుకున్నారు. దీంతో సామాన్య జనం బస్సుల్లో సీటు దొరక్క నానా అవస్థలు పడ్డారు. అయినప్పటికీ ప్రయాణికుల సంఖ్యకు సరిపడా సర్వీసులు అందుబాటులో లేక నానా అవస్థలు పడ్డారు.



బస్టాండ్‌లో కిక్కిరిసి ఉన్న ప్రయాణికులు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి....

మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో మధ్యాహ్నం పూట విపరీతమైన రద్దీ నెలకొంది. ఏసీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు మధ్యాహ్నం సమయంలో అధికంగా ఉండడంతో ఒకేసారి ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. దీనికితోడు బస్టాండ్‌లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌లు పని చేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. విపరీతమైన ఉక్కపోత ఉండడంతో చిన్న పిల్లలతో పాటు వృద్ధులు అవస్థలు పడ్డారు. బస్టాండ్‌లో పదిసీలింగ్ ఫ్యాన్‌లు ఉండగా అందులో కేవలం ఐదు ఫ్యాన్‌లు మాత్రమే రన్నింగ్ కండీషన్‌లో ఉండడంతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మరోవైపు రిజర్వేషన్లు చేసుకున్న సర్వీసులు సైతం గంటలతరబడి ఆలస్యం కావడంతో ప్రయాణికులు అధికారుల తప్పిదం పట్ల తీవ్రఅసహనం వ్యక్తం చేశారు. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రాజధాని ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సును కేటాయించారు. ఇందులో ముందస్తుగా ప్రయాణికులు సీట్లను రిజర్వు చేసుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు బయలు దేరాల్సిన బస్సు గంట ఆలస్యంగా పాయింట్‌పైకి రావడంతో అప్పటి వరకు అక్కడ ఉక్కపోతలో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు కూడ సరిపడా కుర్చీలు లేక మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది దీనికి తోడు బస్టాండ్ ఆవరణమంతా పరిశుభ్రత లేక చెత్త చెదారంతో నిండిపోయింది. దీంతో అధికారుల తీరు పట్ల ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2గంటల వరకు రిజర్వు చేసుకున్న ప్రయాణికులకు సీట్లకు సంబంధించి మెసేజ్ రాకపోవడంతో ఆందోళన చెందినట్లు తెలిపారు. బస్సుసర్వీసుల్లో సమయానికి నడుపకపోగా కనీసం ఆలస్యమవుతుందన్న ముందస్తు సమాచారం కూడ ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం..

ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా డిపో నుంచి హైదరాబాద్ ప్రత్యేకంగా 36 బస్సులను ఏర్పాటు చేశాం. ఇవ్వన్నీ కూడ షటిల్ బస్సులకు అదనంగా రాకపోకలు సాగిస్తున్నాయి. టిమ్ మిషన్లు సకాలంలో అందకపోవడంతో బస్సుల రాకపోకల్లో కొంతమేర ఆలస్యం జరిగింది.

- మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాస్

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



మణికంఠ(ఫైల్)

లక్షెట్టిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బైక్ అడిగితే కొనివ్వడంలేదంటూ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని ఐటీఐ విద్యార్థి శనివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్షెట్టిపేట పట్టణంలోని క్లబ్‌రోడ్డు లంబాడీ తండా కు చెందిన దశరత్‌నాయక్‌కు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న వాడైన రాథోడ్ మణికంఠ(20) మంచి ర్యాల పట్టణంలోని శక్తి ఐటీఐలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మణికంఠ పది రోజుల నుంచి తన తల్లితండ్రులను సుమారు లక్ష యాభైవేలకు పైన ఉండే బైక్ కావాలని ఒత్తిడి చేస్తున్నాడు. దశరత్‌నాయక్ ఆశ్రమ పాఠశాలలో వంట మనిషిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం డబ్బులకు ఇబ్బం దిగా ఉందని ఉన్న డబ్బులు పిల్లల చదువులకు సరిపోకపోవడంతో ఇబ్బంది పడుతున్నానని కొద్ది రోజులు ఆగితే కొని పెట్టే ప్రయత్నం చేస్తానని నచ్చజెప్పాడు. తల్లితండ్రులు చెప్పిన మాట వినకుండా శనివారం రాత్రి మళ్లీ బైక్ కొనివ్వాలని అలిగి ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు స్నేహితులు గదిలోకి వెళ్లి చూసే సరికి ఉరి వేసుకుని కనిపించాడు. చేతికి అందిన కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరు..



బీరేష్(ఫైల్)

వేమనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారం గ్రామానికి చెందిన దైవాల బీరేష్(22) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు నీల్వాయి ఎస్ఐ కోటేశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బీరేష్ ఇంట్లో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్థాపం చెందిన బీరేష్ శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ దొరక లేదు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకురి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించినట్లు ఎస్ఐ తెలిపారు. బీరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

కోటపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల తనిఖీల్లో భాగంగా మండలంలోని పారుపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి దాటాక మహారాష్ట్రకు కారులో తరలుతున్న నగదును పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని సిరొంచ తాలూకా రేగుంట గ్రామానికి చెందిన గడపల్లి సాయి అనే యువకుడు స్కార్పియో వాహనంలో నాగాపూర్ నుంచి సిరొంచకు వెళ్తుండగా పారుపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయగా అందులో రూ. 1.90 లక్షల నగదు లభ్యమైందన్నారు. ఈ డబ్బులకు సంబంధించి రశీదులు, ఆధారాలు చూపించకపోవడంతో తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఎస్ఐ రాజేందర్‌లు నగదును సీజ్ చేసి జిల్లా ఎన్నికల అధికారికి పంపించి తదుపరి చర్యలు చేపట్టనున్న ట్లు వారు తెలిపారు. తనిఖీల్లో గిర్దావర్ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుమరం భీం వర్ధంతికి తరలిరావాలి



కుమరం భీం వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆదివాసీలు

జైనూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భూమి భుక్తి కోసం నైజాం సర్కారుతో వీరోచితంగా పోరాడిన అడవి బిడ్డ కుమరం భీం వర్ధంతి కార్యక్రమానికి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం కుమరం భీం వర్ధంతి పోస్టర్లను ఆదివాసీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కుమరంభీం వర్ధంతికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎతున ఆదివాసీలు, విద్యావంతులు, మేధావులు కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వర్ధంతి నిర్వాహణ కమిటీ సభ్యుడు , మాజీ ఎంపీపీ మోతీరాం, మా జీ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ, మండాడి లింగు, భూపతి, చందన్‌షావ్, ఆత్రం దత్తు, పెందుర్ ప్రకాష్, కనక గంగారాం, కోట్నాక దౌలత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. చింతలమానేపల్లిలో అత్యధికంగా 54.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిర్పూర్(టి)లో 41.5, కౌటాలలో 40.0 తిర్యాణిలో 27.3, దహెగాం లో 24.0, బెజ్జూరులో 20.3 రెబ్బెనలో 17.0, సిర్పూర్(యూ)లో 14.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మురిసేలోపు.. ముంచేసింది..

- భారీ వర్షాలతో సోయా రైతులకు మిగిలింది కడగండ్లే



జామ్నిలో వర్షాలకు దెబ్బతిన్న సోయా పంట

జైనూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో కళకళలాడుతున్న సోయా పంటను చూసి మురిసి పోయిన రైతులను అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు దెబ్బతీశాయి. ఏపుగా పెరిగి పూత, కాతతో ఉన్న సోయా పంటను భారీ వర్షాలు పూర్తగా దెబ్బతీశాయి. భారీ వర్షాలకు పంట చేలల్లో రోజుల తరబడి వరదనీరు నిలువ ఉండడంతో మొక్కలు కుళ్లిపోయాయి. పంట చేతికి అందే దశలో ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షాలు, గాలులకు పూత రాలి, కాయలు పగలడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 945 ఎకరాలలో సోయాబిన్ సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

సోయా సాగు చేసిర రైతులు ఇప్పటికే ఎకరానికి రు. 12వేల నుంచి రూ. 15వేల వరకు పెట్టబడి కోసం వెచ్చించారు. పంట బాగా ఉండడంతో దిగుబడి సైతం ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావించారు. కానీ పంట చేతికి వచ్చే దశలో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో మొక్కపైనే కాయపగిలి గింజలు నేల పాలవుతున్నాయి. ఏటా దసరా పండుగ ముందు సోయాబీన్ దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలకు పంట ఎండిపోయినా వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలువ ఉంది. దీంతో సోయా బీన్ తీయాలన్నా బురదఅంటుకోని ఉండడంతో ఏమి చేయలేక పోతున్నారు. కోతదశలో ఉన్న పంట క్షేత్రంలో నీరు నిలువ ఉండడంతో ఎలాతీయాలో దిక్కుతోచని స్థితిలో వేచి చూస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ అధికారుల సర్వే ప్రకారం 6,704 ఎకరాల్లో పంటు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

జిల్లావ్యాప్తంగా వానాకాలంలో 4.10లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు గుర్తించారు. ప్రధానంగా పత్తి 3.35 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఆగస్టు, సెప్టెంబరు నెలలో భారీవర్షాలు కురువడంతో జలవనరులు నిండుకుండలా మారాయి. లోతట్టు, నది పరివాహక ప్రాంతాల్లో వేసిన పంటలు నీట మునిగి రైతులు నష్ట పోయారు. ప్రభుత్వంనష్టం అంచనావేసి పరిహారం అందించా లని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కెరమెరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరంజీవాడకు చెందిన జాదవ్ అరవింద్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కుసుంరావ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునీర్ అహ్మద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శేషారావు, జలపత్‌రావ్ తదితరులు ఉన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో నికుకుడ గ్రామానికి చెందిన బీజే పీ నాయకులు కిష్టయ్యతో పాటు పలువురు గ్రామస్థులు ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్ర మంలో నాయకులు శ్రీవర్ధన్, విశ్వేశ్వర్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాకాకు ఘన నివాళి

వాంకిడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఆదివారం దివంగత మాజీ ఎంపీ వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, రోషన్, శ్యాంరావు, రాజేశ్వర్, పాండురంగ, దీపక్, మహేష్, సంజీవ్, సంతోష్, వెంకటి, దయానంద్, తిరుపతి, ప్రశాంత్, రమేష్, నూనత్, బుద్దాజీ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి



మాట్లాడుతున్న సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, వీటిని ప్రజల్లో ఎండగట్టాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం సాయిబాబు అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో సగభాగం ఉన్నటు వంటి మహిళలు నేటి పాలకుల విధానాల ఫలితంగా ఆర్థిక రాజకీయ రంగాల్లో వివక్షకు గురవుతున్నారని చెప్పారు. స్కీం వర్కర్లుగా పని చేస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఐకేపీ మెడికల్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం కల్పించడం లేదన్నారు. పట్టించుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేస్తున్నదని చెప్పారు. ఒక వైపు ధరలు అధికంగా పెరుగడం, మరో వైపు విధులు నిర్వహించి కుటుంబాలను పోషించడం కూడా కష్టతరంగా మారిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పూర్తిగా సంఘటిత, అసంఘటిత కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. ధనిక వర్గాలకు అనులకూలంగా ఉండేలా కేంద్రం చట్టాలను రూపొందించిందన్నారు. ఈ విషయాలపై అందరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ పెట్టుబడి దారి వ్యవస్థలో ఉత్పత్తి అయిన సరుకులు అనేక ఆఫర్లు ఇస్తున్నా కూడా అమ్ముడు పోవడం లేదన్నారు. కొనుగోలు శక్తి పెరుగాలంటే కనీస వేతనం రూ.26వేలు ఉండాలని సూ చించారు. కాని జీతాల పెంపు విషయంపాలకులు పట్టించుకోవడం లేదన్నా రు. మహిళలకు చట్టబద్ధమైన ప్రసూతి సెలువులు, ఈఎస్ఐ పీఎఫ్ పని ప్రదేశాల్లో కనీస వసతులు కూడా కల్పించడం లేదని తెలిపారు. అంతకు ముందుకు పట్టణంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జి వెంకటేష్, జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, ఆర్ త్రివేణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు కూశన్న రాజన్న, దుర్గం దినక్, కోట శ్రీనివాస్ ముంజం ఆనంద్‌కుమార్, కార్తీక్, టీకానంద్, ఆనంద్, ఆర్ మహేష్ తదితరలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కాగజ్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు వేసి కోనప్ప ఆహ్వానించారు. కోనేరు కోనప్ప మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సులోచన సంతోష్‌గౌడ్, దుంద్ర శ్రీనివాస్, సత్తన్న పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరందోళి, ముక్దంగూడ, మహారాజ్ గూడ గ్రామాలకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీపీ అబ్దుల్ కలాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంబాజీ, రూప్‌లాల్ నాయక్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు వామన్, ఉత్తమ్, మోహన్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్

కాగజ్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ తెలిపారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పీఆర్టీయూ సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. 317 జీవో వలన అనేక సమస్యలతో ఇబ్బందులు పడ్డామని అన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హక్కుగా రావాల్సిన ఈపీఎఫ్ బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షుడు ఉప్పుల నరసింహ చారి, జిల్లా సహఅధ్యక్షుడు రాకేష్ కుమార్, శ్రావణ్, గంగాభవాని, రాష్ట్ర సహధ్యక్షులు హన్మంతు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో చేపట్టే వివిధకార్యక్రమాలపై తీర్మానాలు చేశారు.

మెట్ల నిర్మాణం చేపట్టేదెప్పుడు..?



మెట్లు నిర్మించని రైల్వే ఓవర్ బ్రిడ్జి

కాగజ్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ఎంజీ రోడ్డుపై గత పదిహేనళ్ల క్రితం రూ.5 కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఇంత వరకు మెట్ల నిర్మించక పోవడంతో సమీపకాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జికి మెట్ల నిర్మాణం చేపట్టాలని రైల్వే జీఎంతో పాటు ఇతర శాఖ అధికారులకు వినతి పత్రాలిచ్చినప్పటికీ కూడా అవి బుట్ట దాఖలావుతున్నాయని పలువురు కాలనీ వాసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలన్నింటికి కూడా మెట్ల నిర్మాణాలున్నాయని, కాగజ్‌నగర్‌లో చేపట్టిన రైల్వే

రాకపోకలకు కాలనీవాసుల ఇబ్బందులు

ఓవర్ బ్రిడ్జికి మాత్రం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వదిలేశారని చెబుతున్నారు. కనీసం అధికారులు కూడా పట్టించుకోలేదు. కాగజ్‌నగర్ రైల్వేఓవర్ బ్రిడ్జి సమీప కాలనీలు సీబాపు కాలనీ, కాపువాడ వాసులకు కాగజ్‌నగర్‌కు రావాలంటే రైల్వేఓవర్ బ్రిడ్జి ఎక్కి రావాల్సిన పరిస్థితి ఉంది. నిత్యం అదనంగా రెండు కిలోమీటర్ల దూరం భారమవుతోందని పలువురు చెబుతున్నారు. మెట్ల నిర్మాణం విషయంలో వాకాబు చేస్తే అప్పటి ధరకు వేసిన టెండరుకు రైల్వే ఓవర్ బ్రిడ్జి ముగింపు సమయానికి ఇసుక, కంకర, సిమెంటు ధరలు అధికంగా పెరిగినట్టు దీంతో కాంట్రాక్టర్ చేతులెత్తినట్టు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వేఓవర్ బ్రిడ్జికి వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయాకాలనీల వాసులు కోరుతున్నారు.

మెట్ల నిర్మాణం చేపట్టాలి..



కాగజ్‌నగర్ రైల్వేఓవర్ బ్రిడ్జికి వెంటనే మెట్ల నిర్మాణం చేపట్టాలి. రాష్ట్రంలో ఉన్న రైల్వేఓవర్ బ్రిడ్జిలకు మెట్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ ఇంత వరకు కాగజ్‌నగర్‌లో మాత్రం మెట్ల నిర్మాణం చేపట్టలేదు. సమీప కాలనీ వాసులు కాగజ్‌నగర్‌కు రావాలంటే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి రెండు కిలోమీటర్ల దూరంతో రావాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మెట్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- మాచర్ల శ్రీనివాస్, కాగజ్‌నగర్

బీమా భరోసా కోల్పోయే ప్రమాదం

- సేవింగ్ అకౌంట్‌ను మార్చుకోని ఉద్యోగులు
- మార్పు కోసం అధికారుల ప్రయత్నం



శ్రీరాంపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో బీమా భరోసాను కల్పించినా కొందరు ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవడం లేదు. సేవింగ్ అకౌంట్ నుంచి శాలరీ అకౌంట్‌కు మార్చుకోవాలని సూచించినా పాటించడం లేదు. ఫలితంగా బీమా అండను వారు కోల్పోయే అవకాశం ఉంది. సింగరేణిలో ఉద్యోగం అంటే గనుల్లోకి దిగి పని చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అనుకోని ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో గాయపడడం, ఒక్కోసారి ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. ఈ సమయంలో కుటుంబానికి ఆర్థికంగా ధీమా కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం వివిధ బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, తదితర బ్యాంకులతో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి కోటి రూపాయల వరకు బీమా సొమ్ము అందుతుంది. కానీ ఇప్పటి వరకు ఉద్యోగులు సేవింగ్ ఖాతాలు కలిగి ఉన్నారు. వాటిలోనే వేతనాలు పడుతున్నాయి. అయితే ఆయా ఖాతాలను శాలరీ ఖాతాలుగా మార్చుకుంటే ముఖ్యంగా వారు ఎలాంటి అదనపు సొమ్ము చెల్లించకుండానే కోటి రూపాయల వరకు ప్రమాద బీమా అమలయ్యే అవకాశం ఉంది. ఏటీఎంల నుంచి అపరిమిత క్యాష్ విత్ డ్రా, ఇతర ప్రయోజనాలు ఉంటాయి.

శ్రీరాంపూర్ ఏరియాలో..

ఏరియాలో తొమ్మిది వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తుండగా, యాజమాన్యం సూచన మేరకు చాలా మంది తమ సేవింగ్ ఖాతాలను శాలరీ అకౌంట్‌గా మార్చుకున్నారు. అయితే ఇంకా కొంత మంది వివిధ కారణాలతో మార్పిడి చేసుకోలేదు. ఇలాంటి వారు ఆగస్టు నెల వరకు 218 మంది ఉండగా, సెప్టెంబరు నెల చివరినాటికి 160 మంది వరకు ఉన్నట్లు పర్సనల్ విభాగం అధికారులు తెలిపారు. ఈ తరుణంలో సేవింగ్ ఖాతాలను శాలరీ అకౌంట్‌గా వెంటనే మార్చుకోవాలని పదే పదే సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



యాజమాన్యం ఉచితంగా కల్పిస్తున్న బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శ్రీరాంపూర్ ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగుల్లో కొంత మంది శాలరీ అకౌంట్లకు మార్చుకోలేదు. వారు వ్యక్తి గతంగా, కుటుంబ అవస రాలకు తీసుకున్న రుణాలు, ఇతర కారణాలతో మార్పునకు అవకాశం లేకుండా పోతోంది. త్వరలో బ్యాంకు అధిక రులు, ఉద్యో గులకు సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. శ్రీరాంపూర్‌లో వందశాతం శాలరీ అకౌంట్లు తీసుకునేలా చూస్తాం.

- శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టరా?

దహెగాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీకలగుండం సమీపంలోని పంట పొలాలకుకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. 20 రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని రైతులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులకు విన్నవించినా తమ సమస్యను పరిష్కరిం చడం లేదని రైతులు గజానన్, పెంటయ్య, బాపు, లింగయ్య చెబుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్

వాగులో కొట్టుకుపోయి రెండు పశువుల మృత్యువాత

కాసిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దనపల్లి వాగులో ఆదివారం రాత్రి ఒక ఎద్దు, ఒక ఆవు కొట్టుకుపోయి మృతి చెందాయి. స్థానికుల వివరాలప్రకారం.. మండలంలోని సోమగూడెం లంబాడితండాకు చెందిన రైతు బానోతు బలరాం ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఎడ్లబండి వెనకాల ఒక ఆవును కట్టుకుని ఇంటికి బయల్దేరాడు. పెద్దనపల్లి వాగు దాటుతుండగా వర ఉధృతికి ఎడ్లబండి కొట్టుకుపోయింది. ఒక ఎద్దు, రైతు బలరాం కొద్ది దూరం కొట్టుకుపోయి ఒడ్డుకు చేరారు. మరో ఎద్దు, ఆవు కొట్టుకుపోయాయి.

పోటీ చేసే అవకాశం కల్పించాలి

కాసిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జన సమితి నుంచి అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ఆదివారం టీజేఎసీ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాంను మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి కలిసి విన్నవించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు ఎన్నికల్లో తెలంగాణ జన సమితి నుంచి పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నామన్నారు. పార్టీ నుంచి పోటీలో నిలించేం దుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సిరాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం ఐక్యవేదిక కన్వీనర్ మణిరాం సింగ్ అన్నారు. మిషన్‌భగీరథ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని, విధులకు గైర్హాజరుకావడంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. బెల్లంపల్లి పట్టణంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. కార్మికుల ఏడు నెలల వేతనాలను అందించాలని పేర్కొన్నారు.

మిత్రుల ఆర్థిక సహాయం

కాసిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ ఓరియంట్ (అదాని) సిమెంట్ కంపెనీలో పర్మినెంటు కార్మికుడిగా విధులు నిర్వహించిన బీఎం శ్యామ్ అనారోగ్యంతో గత నెలలో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు సానుభూతిని ప్రకటించారు. దేవాపూర్ కార్మెల్‌గిరి కాన్వెంట్ స్కూల్‌లో 2002-03 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు రూ. 60,500 నగదును ఆదివారం మృతుని కుటుంబానికి అందజేశారు. అనంతరం శ్యామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు,

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయం

కాసిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని బీజేపీ జిల్లా కార్యదర్శి సంతోష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. సర్పంచు ఎన్నికల్లో కూడా పోటీ చేస్తుందన్నారు. అనంతరం పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సేకరించారు. మండల అధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి బాలరాజు, ఉపాధ్యక్షుడు రాంచందర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పైసలేవి..



- స్థానిక పోరుకు వేధిస్తున్న నిధుల కొరత
- ఒక్కో మండలానికి రూ. 2 లక్షల వ్యయం
- ఆర్థిక భారంతో అధికారులు సతమతం
- ప్రత్యేక గ్రాంట్ కోసం ఎదురుచూపులు

కాసిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు నగారా మోగింది. కానీ ఎన్నికల నిర్వహణపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఆర్థిక భారం అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఒ క్కో మండలానికి ఎన్నికల ఖర్చు రూ. 2 లక్షలు అవు తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యేక నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. అయి నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 23, 27 తేదీల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించేదుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. అలాగే గ్రామపంచాయతీ ఎన్నికలను అక్టోబరు 31తో పాటు నవంబర్ 4, 8 తేదీల్లో మూడువిడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం. చేశారు. ఇప్పటికే ఓటర్ల జాబితా రూపకల్పన నుంచి పోలింగ్ సామగ్రి, రవాణాఖర్చులు చాలా అయ్యాయని అధికారులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో గ్రాంట్ రాకుంటే ఎన్నికలు ఎలా నిర్వహించడం అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు తెచ్చిమరీ ఖర్చు చేయాల్సి వస్తుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మండలానికి రూ. 2లక్షల వ్యయం

స్థానికసంస్థల ఎన్నికల్లో భాగంగా మొదట జిల్లాలో 16 జడ్పీటీసీ, 129ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆతర్వాత మంచిర్యాల జిల్లాలోని 306 గ్రామపంచాయతీలకు, 1468 వార్డు సభ్యులకు మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. మండలాలకు, గ్రామపంచాయతీలకు ఎన్నికల సామగ్రిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమకూర్చగా మిగిలిన స్టేషనరీ, ఎన్నికల సామగ్రి రవాణా, సమావేశా లు, బ్యానర్లు, బ్యాలెట్ బాక్సుల మరమ్మతులు, జిరాక్స్ లు, హమాలీ ఖర్చులు, సిబ్బంది శిక్షణ, స్నాక్స్ భోజ నాలు తదితర బిల్లుల భారమంతా మండల, జిల్లా అధికారులపైనే పడుతుంది. ఈ అవసరాల కోసం నిధులు లేకపోవడంతో స్థానికంగా ఉన్న స్టేషనరీ దుకాణాల్లో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఏ ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ఇబ్బందులు పడిన దాఖలాలు లేవని అధికారులు అంటున్నారు. ఎన్నికలఖర్చుల నిమిత్తం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా మంజూరు చేయకపోవడంతో ఏర్పాట్లు భారమయ్యేలా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమండలాల్లో ఎన్నికల వ్యయం రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు చేరుకుందని చెబుతున్నారు. అటు పంచాయతీల్లోను పంచాయతీ కార్యదర్శులు లక్ష రూపాయల వరకు ముందస్తు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. గత ఏడాది ఫిబ్రవరి2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేకపాలన కొనసాగుతుండగా ఇదే తరహాలో గత ఏడాది ఆ గస్టు నుంచి జిల్లా, మండల పరిషత్‌లలో స్పెషల్ ఆఫీ సర్ల పాలన నడుస్తుంది. అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పంచాయతీలు, మండల పరిషత్‌లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు. విధిలేని పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు సొంత నిధులతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో ఈ సమస్య మరింత తీవ్రం కానుంది. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక నిధులను వెంటనే విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు.

జిల్లాలో ఐదు విడతల్లో స్థానిక ఎన్నికలు

మంచిర్యాల జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండువిడతల్లో జరగనుండగా సర్పంచు ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. మొదటివిడత అక్టోబరు 23న బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాలతో పాటు మందమర్రి, కోటపల్లి మండలాల్లో పోలింగ్ జరగనుంది. రెండవ విడతలో దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, చెన్నూరు, జైపూర్, భీమారం, జన్నారం మండలాలకు పోలింగ్ జరగనుంది. గ్రామపంచాయతీ ఎన్నికలను ఈనెల 31, నవంబరు 4, 8తేదీల్లో నిర్వహించనున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసుశాఖ కూడా పటిష్ట భద్రత చర్యలు చేపడుతుంది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

●రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ●సీఐ శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకా రం కఠిన చర్యలు ఉంటాయని మందమర్రి సీఐ శశిధరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో కొంత సిబ్బంది కొరత ఉందని, అయినా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నామ న్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్ప టికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. నేరాలకు పాల్పడే వారు ఎవరైనా సీసీ కెమెరాల నుంచి తప్పించుకోలేరన్నారు. ప్రజలు కమ్యూనిటీ సీసీ కెమెరాలు పెట్టుకోవడం ద్వారా కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

అపరిచితులు ఎవరైనా కాలనీల్లో పర్యటిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కాసి పేట, రామకృష్ణపూర్, మందమర్రి తదితర ప్రాంతాల్లోని రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. సర్కిల్ పరిధిలో 57 మంది రౌడీ షీటర్లు ఉన్నారని, వీ రిలో 10 మంది జీవనోపాధి కోసం హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లారన్నారు. వీరిని ప్రతి నెల పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సంతకాలు చేయించుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. గత సంవత్సరం 7 గంజాయి కేసులు, ఈ సంవత్సరంలో 2 కేసులు నమోదయ్యాయని తెలిపారు. గంజాయి విక్రయం, రవాణా చేసే కొంత మందిపై నిఘా పెట్టామన్నారు. మహారాష్ట్ర లాంటి ప్రాంతాల నుంచి గంజా యి తీసుకువస్తున్నారని వీరిపై నిఘా ఉంచామన్నారు. కొంత మంది గ్రూపులుగా విడిపోయి దా డులకు పాల్పడే వారిపై పై అధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్టు, అవసరం అయితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలో దొంగతనం పెద్దగా జరగడం లేదని, రాత్రి పూట పెట్రోలిం గ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యాసంస్థల్లో సైబర్ నేరాలు, షీటీంలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బహిరంగంగా మద్యం సేవించే కొన్ని ప్రాంతాలను తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సేవకు మించిన దైవం మరోకటి లేదని పరులకు ఉకారం అందించినప్పుడే మనకు సంతృప్తి కలుగుతుందని శివసాయి గణేష్ సేవసమితి అధ్యక్షుడు పాటి బండ్ల శ్రీరామమూర్తి అన్నారు. దండేపల్లిలో పేద కుటుంబానికి చెందిన చందనగిరి లక్ష్మయ్యకు ఆరు నెలల క్రితం కాలు తీశారు. వైద్యం చేయించుకునే స్థోమత లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. సేవ సమితి ఆధ్వర్యంలో విజయవాడ చెందిన కేబీపీ డెవలపర్స్ సహకారంతో వారి కుటుంబానికి రూ 6వేల ఆర్థిక సాయంతో ఆరునెలలకు సరిపడా నిత్యవసర సరుకులు ఇచ్చారు

నేడు యూరియా పంపిణీ

మందమర్రిరూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు సోమవారం యూరియాను పంపిణీ చేయనున్నట్లు ఏఈవో ముత్యం తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సండ్రోన్‌పల్లి రైతు వేదిక వద్దయూరియా పంపిణీ ఉంటుందని రైతులు ఉదయం 10 గంటలలోగా ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్‌లతో రావాలన్నారు.

సాంప్రదాయాలను కాపాడుకోవాలి

బెల్లంపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత దేశ సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆర్‌ఎస్ఎస్ ముఖ్య వక్త మద్దెల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శాంతిఖని బస్తీలో ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శతజయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్ఎస్ కార్యవాహక్ శేషుకుమార్, న్యాయవాది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



కుటుంబీకులకు డిపాజిట్ బాండ్ అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

చెన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన తోడె రవళి ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కుటుంబాన్ని పరామర్శించారు. మంచిర్యాల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం తరుపున లక్ష రూపాయలు, భూపాలపల్లి జిల్లా రెడ్డి మహిళ సంక్షేమ సంఘం నుంచి రూ. 40 వేలు మొత్తం రూ. 1.40 లక్షల ఆర్థిక సహాయం కుటుంబానికి అందించారు. ఈ మొత్తాన్ని ఇద్దరు కుమారుల పేరుమీద ఎల్ఐసీలో డిపాజిట్ చేసి కుటుంబీకులకు బాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సంతోషం గోపాల్‌రెడ్డి, పోతు సత్యనారాయణ రెడ్డి, వెన్నపురెడ్డి బాపురెడ్డి, వేమునూరి రాజేశ్వర్‌రెడ్డి, రత్న సత్యనారాయణరెడ్డి, ఒడేటి రాంరెడ్డి, మడక రవికుమార్, తోడె నర్సింహారెడ్డి, గద్దె నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

దండేపల్లి అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీసుకవచ్చిన 42 శాతం రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మండలం లోని ముత్యంపేటలో మండలస్థాయి, కార్యకర్తలతో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చ డంలో పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ హయాంలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి గ్రామాల అభివృద్ధి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈరెండు పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ప్రధాని మోదీ హయాంలో గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయాలు కేటాయించి గ్రామాలాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష కార్యదర్శు రవిగౌడ్, సంతోష్, అనిల్, నాయకులు ముకేష్‌గౌడ్, రాజయ్య, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవకు దాతలు సహకరించాలి



అల్పాహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

బెల్లంపల్లి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): తిలక్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని దాతలు సహకరించాలని తిలక్‌వాకర్స్ వెల్ఫేర్ అసోసియషన్ నాయకులు రత్నం రాజన్న, రంగ రామన్న, నాగేశ్ కుమార్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులకు, నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేసి మాట్లాడారు. తిలక్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని దాతలు సహకరించి ప్రోత్సహించాలన్నారు. ఎవరైన పుట్టిన రోజు, పెళ్లి రోజు వేడుకల సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలనుకుంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జయరాం యాదవ్, రాజుకుమార్, శ్రీనివాస్, పోచన్న, లింగయ్య, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

'స్థానికం'లో జంపింగ్‌ల హవా..!

(3వ పేజీ తరువాయి)

ఈ పరిస్థితి మంచిర్యాల నియోజకవర్గంలో కొంతమేర తక్కువగానే ఉంది. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మొదటి నుంచి కాం గ్రెస్‌లోనే ఉన్నారు. 2018 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ ఆయన పార్టీ మారలేదు. అంతకు ముందు నుంచే పార్టీని అంటిపె ట్టుకుని దాని అభివృద్ధికి కృషి చేశారు. ఆయనతోపాటే పాత క్యాడర్ కూ డా పార్టీనే అంటి పెట్టుకుని ఉంది. ఇదిలా ఉండగా 2023 ఎన్నికల్లో.. బీ ఆర్ఎస్ నుంచి భారీగా నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో పాత క్యాడర్‌తోపాటు కొత్తగా పార్టీలో చేరిన వారు సైతం టికెట్ రేసులో ఉన్నారు. అయితే పాత క్యాడర్ పటిష్టంగా ఉండటంతో నియోజక వర్గంలో వారికే ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతు న్నాయి. మరోవైపు రెండేళ్ల క్రితం పార్టీలోకి వచ్చిన వారిలో సైతం కొం దరు ప్రజాదరణ కలిగి ఉన్నారు.

ఈ క్రమంలో పాత క్యాడర్‌తోపాటు కొత్తగా చేరి, ప్రజాదరణ కలిగిన నాయకులకు కూడా టికెట్లు దక్కుతాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే జిల్లాలోని మూడు నియో జకవర్గాలకు చెందిన ముఖ్య నేతలు టికెట్ల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితులు ఉన్నాయి. ఓ వైపు పార్టీ అధిష్టానం గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో పాత, కొత్త క్యాడర్ అనే తేడా లేకుండా టికెట్ల పంపకాలు ఉంటాయనే చర్చ సాగుతోంది.

ఓటర్ల లెక్కలు తీస్తూ..

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆశావహులు తమ కార్యా చరణ అమలు పరుస్తున్నారు. తన పరిధిలో ఎన్ని ఓట్లు ఉన్నాయి ? తమకు అనుకూలంగా ఎందరు ఉంటారు ? ఇతర పార్టీల ఓటర్లు ఎవరున్నారు ? అంటూ లెక్కలు వేస్తున్నారు. ఇతరుల నుంచి ఓట్లు ఎలా రాబట్టు కోవాలో ప్రణాళికలు రచిస్తున్నారు.

ఈ క్రమంలో తమ పరిధిలోకి వచ్చే ఓటర్లను మచ్చిక చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కొంతమంది నాయకులైతే గతంలో ఉన్న తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. తద్వారా ఓటర్ల మెప్పు పొందేందుకు సర్వశక్తులా ప్రయత్నిస్తున్నారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తుండగా, గ్రామాల్లోనూ ఈ అంశంపైనే అధికంగా చర్చ సాగుతోంది.

ఘనంగా కాకా జయంతి వేడుకలు



మందమర్రిలో కాకా జయంతి వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ కురువృద్ధుడు దివంగత కేంద్ర మాజీ మంత్రి కాకా 96వ జయంతి వేడుకలు మందమర్రిలో ఆదివారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. అంతకుముందు ఆ యన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల జిల్లా పట్టణ నాయకులు ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, తిరుమల్, నర్సింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

●రామకృష్ణాపూర్ పట్టణంలో కాకా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా పట్టణ నాయకులు రఘునాథ్‌రెడ్డి, పార్వతి విజయ పాల్గొన్నారు.

●రామకృష్ణాపూర్ పట్టణంలోని రామాలయం చౌరస్తా వద్ద కళాకారులకు క్యాతన్‌పల్లి మున్సిపాలిటి 21వ వార్డు మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకురాలు పార్వతి విజయ, మాజీ ఎంపీపీ మహంకాళి శ్రీనివాస్ కళాకారులకు వివేక్ యువ సేన పేరిట దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాకా వెంకటస్వామి విగ్ర హానికి కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. హైదరాబాద్‌లో శాసన సభ లాంజ్‌లో ఏర్పాటు చేసిన కాకా వెంకటస్వామి చిత్రపటానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌తోపాటు ఎమ్మెల్యే గడ్డం వినోద్, శాసన మండలి చైర్మన్ గుత్త సురేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ రాకేశ్ రెడ్డితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు.

తాండూర్ : తాండూర్‌లో కాంగ్రెస్ కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమనపల్లి : నీల్వాయి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్, మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, రాజన్న, గణపతి, రాంచందర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

నెన్నెల : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కాకా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్, మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, గురునాథం మల్లాగౌడ్ పాల్గొన్నారు.

జైపూర్ : కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు ఫయాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రమేష్, వెంకటేశం, శ్రీనివాస్ యాదవ్, మున్నా, నర్స య్య, గణేష్, రాజన్న, రవి పాల్గొన్నారు.

జన్నారం: మాలమహానాడు ఆధ్వర్యంలో కాకా వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు సురేశ్, నాయకులు సంజీవ్, భూమన్న, పద్మరావు, గోపి సత్యనారాయణలు పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, నాయకులు కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రాజమల్లగౌడ్, మాజీ జడ్పీటీసీ అస్గర్, పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ ప్రసాద్, నాయకులు లక్ష్మణ్ గౌడ్, రాజన్న, ప్రభాకర్, పాల్గొన్నారు.

హాజీపూర్: మాలమహానాడు ఆధ్వర్యంలో హాజీపూర్ మండల కేంద్రంలో గడ్డం వెంకటస్వామి కాకా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుదీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధూకర్ హాజరయ్యారు. మండల కేంద్రంలో కాకా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో గడ్డం వెంకటస్వామి జయంతి ఉత్సవాలను కమాండెంట్ రాములు ఆధ్వర్యంలో నిర్వ హించారు. అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కన్నెపల్లి : మండల కేంద్రంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు రామాంజనేయలు కేక్ కట్ చేశారు. నాయకులు హన్మంతు, రోహిత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట : పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహవం వద్ద కాకా జయంతి వేడుకలను ఆయన అభిమానులు, మాల సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నివాళులర్పించారు. సుభాష్, రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : కాకా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాకా అభిమాని, వివేక్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, సింగరేణి బీసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి బరపటి మారుతి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాంగణంలో కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయి దృష్టి అంధుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సురేష్ యాదవ్, నాయకులు కిరణ్, తిరుపతి, లక్ష్మణ్, ప్రవీణ్, మహేష్, శంకర్ పాల్గొన్నారు.



కాకా చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న స్పీకర్, ఎమ్మెల్యే, నాయకులు

ఆంధ్రజ్యోతి
6

కుమరం భీం
జిల్లా వార్తలు
సోమవారం 6 అక్టోబరు 2025

గంజాయిపై ఉక్కుపాదం

ఆసిఫాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని గం.జాయి పండించిన, విక్రయించిన, సేవించిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికంగా ఆదివారం అయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలనే దిశగా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నదని అన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 51 కేసులు నమోదు చేసి 95 మందిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని చెప్పారు. ఇప్పటి వరకు రూ. 3.62 లక్షల విలువ గల 14.7 కిలోల ఎండు గంజాయి రూ. 47.20 లక్షల విలువ గల 472 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయి మాదక ద్రవ్యాల సరఫరా వినియోగం గురించి సమాచారం తెలిసిన వారు 8712670551, 100లకు సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పరిషత్ ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు



- జిల్లాలో రెండు విడతల్లో నిర్వహణకు అధికారుల కసరత్తు



ఆసిఫాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం

ఆసిఫాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల, జిల్లాపరిషత్తు ఎన్నికలదిశగా అధికార యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది. మొదటి విడతలో జిల్లాలోని ఎనిమిది మండలాల జడ్పీటీసీ స్థానాలకు, 71 ఎంపీటీసీ స్థానాలకు, రెండోవిడతలో 7మండలాలలోని 7జడ్పీటీసీలతో పాటు ఆమండలాల పరిధిలోని 56 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 9వతేదిన నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచే నామినేషన్లు స్వీకరించాల్సి ఉండడంతో ఇందుకు తగిన సదుపాయాలు మండలాల వారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆయా విభాగాల అధికారులతో సమీక్షలు నిర్వహించి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిం చేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు రాష్ట్రఎన్నికల సంఘానికి నివేదిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అదికారులకు శిక్షణ పూర్తి చేశారు.

● మొదటి విడతలో..

జిల్లాలో మొదటి విడతలో8 మండలాలలోని 8 జడ్పీటీసీలతో పాటు ఆ మండలాల పరిధిలోని 71 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్‌లు ఉండగా మొదటి విడతలో ఒక డివిజన్ ,రెండో విడతలో మరో డివిజన్‌లో ఎన్నికలు జరిపే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మొదటి విడతలో కాగజ్ నగర్ రెవెన్యూ డివిజన్‌పరిధిలోని కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికల పేటతో పాటు ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని రెబ్బెన మండలంలో ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించారు. రెండో విడతలో ఆసిఫాబాద్ రెవెన్యూడివిజన్‌లోని 7మండలాలలోని7 జడ్పీటీసీలతో పాటు ఆ మండలాల పరిధిలోని 56 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, తిర్యాణి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలలో ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్ల వివరాలు ఇలా..

క్రమ సంఖ్య	మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
1.	ఆసిఫాబాద్	ఎస్టీ(జనరల్)	ఎస్టీమహిళ
2.	సిర్పూర్(యూ)	జనరల్	ఎస్టీ మహిళ
3.	లింగాపూర్	జనరల్ మహిళ	ఎస్టీ మహిళ
4.	జైనూరు	బీసీ జనరల్	ఎస్టీ జనరల్
5.	తిర్యాణి	బీసీ మహిళ	జనరల్
6.	కెరమెరి	బీసీ జనరల్	జనరల్మహిళ
7.	వాంకిడి	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
8.	రెబ్బెన	బీసీ మహిళ	బీసీ జనరల్
9.	బెజ్జూరు	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
10.	పెంచికలపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
11.	కాగజ్‌నగర్	బీసీ మహిళ	బీసీ మహిళ
12.	కౌటాల	బీసీ జనరల్	బీసీ జనరల్
13.	చింతలమానేపల్లి	ఎస్టీ జనరల్	బీసీ మహిళ
14.	దహెగాం	ఎస్టీ మహిళ	ఎస్సీ జనరల్
15.	సిర్పూర్(టి)	ఎస్సీ జనరల్	బీసీ జనరల్

బీజేపీ బలోపేతానికి పాటుపడాలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. రెబ్బెన మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు ఆదివారం హరీష్ బాబు సమక్షంలో బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షే మ పథకాలు నిరుపేదలకు లబ్ధి చేకూర్చుతు న్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు కార్యకర్తలు పాటుపడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, బొడ్డుమౌనిక, మల్లేష్, బొడ్డు రాజ్‌కుమార్, ఇగురపు రమేశ్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): డబ్బా గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ రాజారాంతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని వారు సూచించారు.

ఘనంగా రాణి దుర్గావతి జయంతి

బెజ్జూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఆదివాసీ వీరవనిత రాణి దుర్గావతి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాణి దుర్గావతి మొగల్ చక్రవర్తులతో తన రాజ్యాం కోసం పోరాటం చేసిందన్నారు. ఆమె జీవితం ఆదివాసీ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, అమృత, శంకర్, తిరుపతి, బక్కయ్య, రమేష్, వెంకటేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో పోలీసుల వైఖరి సరికాదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన గణపతి, దుర్గమాత ఉత్సవాల సందర్భంగా చేపట్టిన శోభాయాత్రలో పోలీసు అధికారులు వ్యవహ రించిన తీరు సరికాదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. బ్రాహ్మణ వాడలోని మినీ ఫంక్షన్‌హాలులో ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీలు బాలేశ్వర్‌గౌడ్, అరిగెల మల్లిఖార్జున్, మాజీ మార్కెట్ ఛైర్మన్లు వెంకన్న, మల్లేష్, వినాయక, దుర్గ మండళ్ల నిర్వహకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ ఓ ఎస్సై దుర్గమాత విగ్రహాలను బొమ్మలను తరలించాలని అనడం సరికాదన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్య లు చేసిన ఎస్సైతో పాటు బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయా లని డిమాండ్ చేశారు. నిమజ్జన శోభాయాత్ర లో సంప్రదాయబద్ధంగా, శాంతియుతంగా ఊరేగింపు నిర్వహి స్తున్న బ్రాహ్మణ వాడ మహిళలపై ఎస్సై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు పలువురు నిర్వహకులపై పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు. ఇలా ఇష్ట రాజ్యంగా వ్యవహ రించడం సరికాదన్నారు. పోలీసుల వ్యవహరించిన తీరు, అక్రమ కేసులకు నిరసనగా సోమవారం ఆసిఫాబాద్ పట్టణ బంద్ పాటించాలని అఖిల పక్షం తీర్మానించింది. సమావేశంలో పట్టణ వాణిజ్య వ్యాపార సభ్యులు ప్రమోద్, వెంకన్న, గిరష్, విశ్వహిం దూ పరిషత్ అధ్యక్షుడు సంతోష్, వినాయక; దుర్గామండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వారసంత.. వర్షంతో చింత


వారసంతలో వర్షంతో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు

బెజ్జూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో ఆదివారం వర్షం కురవడంతో వార సంత చిత్తడిగా మారింది. ప్రతి ఆదివారం మండల కేంద్రంలోని వార సంత నిర్వహిస్తుంటారు. సంతలో క్రయ విక్రయదారులకు సరైన వసతులు లేని కారణంగా వర్షం కురిసినప్పుడల్లా అవస్థలు పడుతున్నారు. వ్యాపారులు కూర్చోవడానికి గద్దెలు లేక పోవడంతో వార సంత స్థలం పూర్తిగా బురద మయంగా మారుతుంది దీంతో సంతకు వచ్చి విక్రయించేందుకు తీసుకొచ్చిన సామగ్రి పూర్తిగా వర్షంలో తడిసి పోతుందని విక్రయదారులు వాపోతు న్నారు. వార సంత ద్వారా గ్రామ పంచాయతీకి లక్షల ఆదాయం సమకూరుతున్నా సరైన వసతులు కల్పించడం లేదని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బెజ్జూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం గోల్కొండ కాలనీకి చెందిన పూసాల ఊర్మిళ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కూతురు అంజలికి ఆదివారం యువకులు రూ.32,500, కాలనీకి చెందిన తుకారాం జాదవ్ రూ.24,600 నగదును అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. కడుపేదరికంలో రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉండడంతో యువకులు ఆర్థిక సాయం కోరుతూ సోషల్ మీడియాలో పోస్టు చేయడం ద్వారా పలువురు స్పందించారు. కార్యక్రమంలో యువకులు తుకారాం, తాజోద్దీన్, అమీరుద్దీన్, మల్లేష్, జావీద్ అలీ, నాగేష్, శ్రీనివాస్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

కెరమెరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం ఝురి గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ నివాసంలో ఆదివారం కుంరం సూరు వర్ధంతి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మారుతి, రాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.